సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 10, మే, 2023



'అగ్ని' పరీక్షే..
అగ్నిమాపక శాఖ సిబ్బంది కొరతతో సతమత మవుతోంది. వాహనాలు కూడా సరిపడా లేకపోవడంతో ఇబ్బంది అవుతోంది. 8లో



'ప్రగతి'బాటలో ఆర్టీసీ
శుభకార్యాలు పెద్దసంఖ్యలో జరుగుతుండడంతో ఖమ్మం రీజియన్‌లోని ఆరు ఆర్టీసీ డిపోలకు ఆశించిన స్థాయిలో ఆదాయం వస్తోంది. 10లో



వాతావరణం
జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత అధికంగా నమోదవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.


న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా రామయ్య నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళ వారం శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞో పవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. మంగళ వారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి ఎంసెట్



సుజాతనగర్: ఇంజనీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్ పరీక్షలు ఈనెల 10 నుంచి 14 వరకు అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ పరీక్షలకు 125 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఒక విడత, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించను న్నారు. ఉదయం పరీక్షకు 7 నుంచి 8.30 గంటల మధ్య, మధ్యాహ్నం పరీక్షకు 1 నుంచి 2.30 గంటల మధ్య కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. నిమిషం నిబంధన అమల్లో ఉందని నిర్వాహకులు తెలిపారు. బ్లాక్ లేదా బ్లూ పాయింట్ పెన్, హాల్‌టికెట్, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అప్లికేషన్, ఫొటో గుర్తింపు కార్డుతో హాజరవ్వాలని తెలిపారు.

పాల్వంచ : పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో కూడా ఎంసెట్ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు రోజుల పాటు రెండు విభాగాల్లో జరిగే ఈ పరీక్షలకు ఒక్కో సెషన్‌కు 100 మంది చొప్పున హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

మెరుగైన సేవలు అందించండి
- డీఎంహెచ్‌ఓ శిరీష


పీహెచ్‌సీ సిబ్బందితో డీఎంహెచ్‌ఓ శిరీష

చంద్రుగొండ : పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. రికార్డులు, రోజువారి ఓపీ రిజిస్టర్ తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నాణ్యమైన సేవలతో ప్రజలకు పీహెచ్‌సీల పట్ల నమ్మకం కలిగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ఎంసీహెచ్ ప్రోగ్రాం అధికారిణి చైతన్య, డీపీఓ దుర్గ, స్థానిక డాక్టర్ కనకం తనూజ పాల్గొన్నారు.

అందరి బంధువుకు ఆదరణేది?

అభివృద్ధికి నోచుకోని భద్రాద్రి రామాలయం
- మాస్టర్ ప్లాన్ అన్నారు.. మరిచిపోయారు..
- జీఓలకే పరిమితమైన ప్రత్యేక నిధులు
- నేడు డివిజన్‌లో దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పర్యటన


మాస్టర్‌ప్లాన్ ప్రకారం రామాలయ ఊహా చిత్రం

భద్రాచలం: విశ్వవిఖ్యాతంగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం వేచి చూస్తోంది. అందరి బంధువుగా పేరుగాంచి కోర్కెలు తీర్చే రాముడు కొలువై ఉన్న ఈ క్షేత్రాన్ని పట్టించుకోవాలని భక్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఆలయ అభివృద్ధితో పాటు భద్రాచలం కేంద్రంగా టూరిజం హబ్‌గా మార్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేడు భద్రాచలం డివిజన్‌లో పర్యటించనున్న రాష్ట్ర దేవాదాయ, అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అయినా భద్రగిరి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని భద్రాచలం వాసులు, భక్తులు వేడుకుంటున్నారు.

మాస్టర్‌ప్లాన్ ముచ్చటేమాయె..?

2014లో ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి భద్రాచలం వచ్చిన కేసీఆర్ రామాలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు 'మాస్టర్ ప్లాన్' ప్రకటించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనందసాయికి ఈ బాధ్యతలు అప్పగించారు. పలు దఫాలుగా భద్రాచలం వచ్చిన ఆయన స్థానిక పండితులు, అర్చకుల సలహాలు, సూచనలతో పలు డిజైన్లు రూపొందించారు. ఇక వాటి అమలే తరువాయి అనుకున్న తరుణంలో మాస్టర్‌ప్లాన్ మాయమైంది. ఆ తర్వాత నిధులు ప్రకటించిన యాద్రాద్రి అదరహో అనే రీతిలో సిద్ధమై భక్తులకు అందుబాటులోకి వచ్చినా భద్రాద్రి ఆలయాభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా మిగిలిపోయింది. దీనిపై పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు నిరసన తెలిపినా పట్టించుకోలేదు. ఇటీవల కొండగట్టు అంజన్న ఆలయాభివృద్ధికి రూ.100 కోట్లు సీఎం కేసీఆర్ ప్రకటించగా మళ్లీ రామాలయం మాస్టర్ ప్లాన్ చర్చకు వచ్చింది. ప్రతి ఏడాది శ్రీరామనవమి ఉత్సవాలకు ప్రభుత్వం తరపున హాజరవుతున్న దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అయినా భద్రాచలం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రసాద్ పథకంలో కొన్ని అభివృద్ధి పనులకు టెండర్లు పూర్తి కాగా, రాష్ట్ర ప్రభుత్వ నిధులు అదనంగా జమైతే మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయని అంటున్నారు.

టూరిజం హబ్‌కు అవకాశం..

భద్రాచలం కేంద్రంగా టూరిజం అభివృద్ధికి అవకాశం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు ప్రయత్నించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. భద్రాచలం వచ్చే భక్తులకు స్వామివారి దర్శనంతో పాటు ఇంకా పలు పుణ్యక్షేత్రాలు, ప్రకృతి ప్రేమికుల కోసం అడవులు, వాటి నడుమ వాటర్ ఫాల్స్ అందుబాటులో ఉన్నాయి. భద్రాచలం నుంచి పర్ణశాల వెళ్లే భక్తులు.. మరో 82 కిలోమీటర్లు పోతే వాజేడులోని బొగత జలపాతం ఉంటుంది. ఇటు కిన్నెరసాని పర్యాటక ప్రాంతం కూడా 26 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. నిండు గోదావరిలో లాంచీలపై కుటుంబంతో సహా ఆహ్లాదంగా గడిపేందుకు ఏపీలోని పాపికొండల యాత్ర 75 కిలోమీటర్లు మాత్రమే. ఇంకా ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన వాటర్‌ఫాల్స్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా ఉన్న ఏపీలోని పొల్లూరు, మోతుగూడెం 99 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. భద్రాచలం ఏజెన్సీలో సహజ సిద్ధ అడవులు, వాటిలో ప్రకృతి దృశ్యాలు ఎన్నెన్నో. ఇవన్నీ భద్రాచలానికి 100 కిలోమీటర్ల దూరంలోనే ఉన్నాయి. భద్రాచలాన్ని టూరిజం హబ్‌గా ప్రకటించి ఆ దిశగా ఏర్పాట్లు చేస్తే వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

ఇంకా అందని నవమి నిధులు..
భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే ముక్కోటి, శ్రీరామనవమి ఉత్సవాలకు సైతం ఆలయం నుంచే నిధులు వెచ్చిస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లోనైనా ప్రభుత్వం నిధులను విడుదల చేయాలని భక్తులు కోరుతుండగా.. ఎట్టకేలకు ఈ ఏడాది జరిగిన శ్రీరామనవమికి రూ.కోటి విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ముందుగానే ప్రకటించింది. అయితే వేడుకలు ముగిసి నెల దాటినా నేటికీ ఆ నిధులు అందలేదని తెలుస్తోంది. శ్రీరామనవమి, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు రూ.2 కోట్లకు పైగా దేవస్థానం నుంచే ఖర్చు చేశారు. ఇవైనా ప్రభుత్వం నుంచి అందితే భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

అభివృద్ధికి మంత్రులు సహకరించాలి



భద్రాచలం క్షేత్రంతో పాటు పట్టణ అభివృద్ధికి రాష్ట్ర మంత్రులు సహకరించాలి. రామయ్య దర్శనాలకే కాకుండా ఇక్కడ ప్రజల మనోభీష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలి. భద్రాచలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తే ఎంతో మంది గిరిజనులకు ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన రూ.100 కోట్లు వెంటనే విడుదల చేసి మాస్టర్ ప్లాన్ అమలుచేయాలి.

– పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే

ప్రభుత్వ విద్యార్థుల హవా
- ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 60 శాతం..
- ద్వితీయ సంవత్సరంలో 74 శాతం మంది ఉత్తీర్ణత
- రాష్ట్ర స్థాయిలో జిల్లాకు ఆరో స్థానం



కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియెట్‌లో జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్ విభాగంలో 7,999 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 4,865 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,363 మందికి గానూ 1,364 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా చూస్తే మొదటి సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇక ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో 6,984 మంది విద్యార్థులకు గానూ 5,103 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్‌లో 1,943 మందికి గానూ 1,484 మంది ఉత్తీర్ణులు కాగా, 73 శాతం నమోదైందని జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి సులోచనారాణి వివరించారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ సంవత్సరంలో 12వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో 6వ స్థానంలో నిలిచామని చెప్పారు. ద్వితీయ సంవత్సరం వృత్తి విద్యా ప్రైవేటు ఫలితాలలో 36 మంది బాలురు, నలుగురు బాలికలు మొత్తం 40 మంది హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 5వ స్థానంలో జిల్లా నిలిచిందని చెప్పారు. జిల్లాలో ఈసారి 90 శాతం ఫలితాలు సాధిస్తామని అంచనా వేయగా.. దానికి చేరువలోకి వచ్చామని డీఐఈఓ తెలిపారు. అయితే కొన్ని సబ్జెక్టుల పుస్తకాలు పరీక్షల వరకు కూడా విద్యార్థులకు అందుబాటులో లేకపోవడం, బుక్ షాపుల నుంచి మెటీరియల్ కొనుగోలు చేసి చదవడం వంటి కారణాలతో ఆశించిన ఉత్తీర్ణత నమోదు కాలేదు.

కలెక్టర్ హర్షం..


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సులోచనారాణి

ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ఆరో స్థానం సాధించడం పట్ల కలెక్టర్ అనుదీప్ హర్షం వ్యక్తం చేశారు. ఫలితాలు వెలువడగానే డీఐఈఓ సులోచనారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ద్వితీయ సంవత్సరంలో 2,899 మంది బాలురకు 1,958 మంది, 4,085 మంది బాలికలకు 3,145 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. మొదటి సంవత్సరంలో 3,571 మంది బాలురకు 1,868 మంది, 4438 మంది బాలికలకు 2,997 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. వృత్తి విద్యా కోర్సుల్లో జిల్లా ప్రథమ సంవత్సరంలో 9వ స్థానం, ద్వితీయ సంవత్సరంలో ఐదో స్థానంలో నిలిచిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేసిన అధ్యాపకులను కలెక్టర్ అభినందించారు.

సమ్మెకే మొగ్గు..
- వెనక్కు తగ్గని జేపీఎస్‌లు
- విధుల్లో చేరిన 24 మంది!


కొత్తగూడెంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు

చుంచుపల్లి: సమ్మె బాట పట్టిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను మంగళవారం సాయంత్రంలోగా విధుల్లో చేరాలని ప్రభుత్వం డెడ్‌లైన్ విధించినా దాన్ని బేఖాతర్ చేస్తూ ఎక్కువ మంది సమ్మెకే మొగ్గు చూపారు. అయితే మండలానికి ఒకరిద్దరు చొప్పున.. జిల్లా వ్యాప్తంగా 24 మంది విధుల్లో చేరినట్లు తెలిసింది. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో బుధవారం నుంచి సమ్మెను ఉధృతం చేయాలని జేపీఎస్‌లు యోచిస్తున్నారు. అందుకు అనుగుణంగా రోజువారీ నిరసనలకు సంబంధించి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లాలో 353 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు మరో 24 మంది ఔట్ సోర్సింగ్ కార్యదర్శులు సైతం సమ్మెలో పాల్గొంటున్నారు. తమకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెబుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించడం సరైంది కాదని, ఉద్యోగాలు క్రమబద్ధీకరణ చేయాలని మాత్రమే కోరుతున్నామని అంటున్నారు. తమకిచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్నారు. విధుల్లో చేరాలని డెడ్‌లైన్ పెడుతూ భయభ్రాంతులకు గురిచేయడం సరైంది కాదని అంటున్నారు. సమస్యలు పరిష్కరించాలని తాము శాంతియుతంగా సమ్మె చేస్తుంటే ఉద్యోగాల నుంచి తీసేస్తామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తేనే సమ్మె విరమిస్తామని చెబుతున్నారు.

హామీ ఇచ్చేంతవరకూ సమ్మె



జేపీఎస్‌ల ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. గ్రామాల అభివృద్ధికి నాలుగేళ్లుగా కృషి చేస్తున్నాం. మా సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నాం. మాకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగిస్తాం.

– సంపత్ శ్రీనివాస్, జేపీఎస్

సానుకూల నిర్ణయం తీసుకోవాలి



జేపీఎస్‌లు చేపడుతున్న సమ్మె సర్కారుకు వ్యతిరేకం కాదు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నాం. 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. మా విధులను గౌరవించి ఇప్పటికైనా సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలి.

– వంశీకృష్ణ, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

'ఆరోగ్య మహిళ'పై అవగాహన కల్పించండి
- వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశం
- గుంపెనలో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన


గుంపెనలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

అన్నపురెడ్డిపల్లి: ఆరోగ్య మహిళా క్లినిక్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి డాక్టర్ ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో కాన్పుల సంఖ్య పెంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి మంగళవారం జిల్లాలో ఐదు పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా క్లినిక్‌లను నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో మహిళలకు సంబంధించిన తొమ్మిది రకాల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు. టీ - హబ్ ద్వారా 53 రకాల పరీక్షలు చేస్తారని, పీహెచ్‌సీలో సమస్య పరిష్కారం కాకుంటే ఎంసీహెచ్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి సిఫార్సు చేస్తారని చెప్పారు. ఎర్రగుంట పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు.

'ధాన్యం' సమస్య పరిష్కరిస్తాం

ధాన్యం కొనుగోళ్లలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మండలంలోని గుంపెనలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడి సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అకాల వర్షాలతో ఇబ్బంది పడుతున్నామని, ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని కోరారు. మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవడం లేదని సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ చెప్పగా.. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లును కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్య పడవద్దని అన్నారు. కొనుగోళ్లలో ఏమైనా సమస్యలు వెంటనే జిల్లా అధికారులను పంపించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శిరీష, డీసీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ అన్నపూర్ణ, తహసీల్దార్ భద్రకాళి, ఎంపీఓ షబ్నా, వైస్ ఎంపీపీ రామారావు, సర్పంచ్‌లు సురేష్, నున్న బసవయ్య, ఉప సర్పంచ్ చిన్న లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రతిగింజా కొంటాం

చంద్రుగొండ : ప్రతీ ధాన్యపు గింజా కొంటామని, రైతులు అధైర్య పడవద్దని కలెక్టర్ అనుదీప్ అన్నారు. మండలంలోని మద్దుకూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సందర్శించారు. బుధవారం ధాన్యం కాంటాలను ప్రారంభించాలని సొసైటీ అధికారులకు సూచించారు. ఎగుమతికి లారీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఓ నాగేశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

చుంచుపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలోని 11వ వార్డులో మంగళవారం వారు బస్తీ దవాఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు దూరం వెళ్లకుండా బస్తీ దవాఖాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, డీఎంహెచ్‌ఓ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రవిబాబు, మున్సిపల్ కమిషనర్ రఘు, బస్తీ దవాఖానా వైద్యాధికారి అఫ్రోజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్ శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల యూనిఫాం సిద్ధం


యూనిఫాంను పరిశీలిస్తున్న ఎస్‌కే సైదులు

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసే యూనిఫాంలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే సైదులు తెలిపారు. భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలకు యూనిఫాంలు తయారు చేసే టైలరింగ్ కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించి మాట్లాడారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ముందస్తు ప్రణాళికతో మార్చిలోనే యూనిఫాం క్లాత్ అందించామని, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వెంటనే టైలర్ వద్దకు చేర్చి నూతన డిజైన్‌ల ప్రకారం రెండు జతల యూనిఫాం సిద్ధం చేసి పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి 'మన ఊరు – మన బడి'పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సమ్మయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ దుర్గా శ్రీనివాస్, హెచ్‌ఎం పద్మ, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీటీసీకి అస్వస్థత


జెడ్పీటీసీని ఆస్పత్రికి తీసుకెళ్తున్న కార్యకర్తలు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సమావేశం జరుగుతుండగా వేదికపై ఉన్న జెడ్పీటీసీ ఉమాదేవి ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పగా విశ్రాంతి కోసం పక్కనే ఉన్న గదికి పంపించారు. ఆ తర్వాత ఆమెకు నొప్పి తీవ్రం కావడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు కుర్చీ సాయంతో వాహనం వద్దకు తీసుకెళ్లి ఇల్లెందు ఆస్పత్రిలో చేర్పడంతో సాయంత్రానికల్లా కోలుకున్నారు. ఆమెను ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ హరిసింగ్‌నాయక్ తదితరులు పరామర్శించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచ: పేకాట స్థావరంపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం పట్టణ పరిధిలోని పేటచెరువు గ్రామ సమీప అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో పట్టణ ఎస్‌ఐ ఎ.నరేశ్, కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కలిసి దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు పరారయ్యారు. వారి నుంచి రూ.20,300 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో రోడ్డు ప్రమాదం

చర్లకు చెందిన మహిళ మృతి

చర్ల: మండల కేంద్రానికి చెందిన మహిళ మంగళవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చర్ల మండల కేంద్రంలోని జాడి బాబూరావు తన సతీమణి గురువమ్మ (55) కలిసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్‌లో జరుగుతున్న వివాహ కార్యక్రమానికి బయలుదేరా రు. వారి స్వగ్రామమైన బీజాపూర్ జిల్లాలోని అవుపల్లికి వెళ్లి అక్కడి నుంచి బంధువులతో కలిసి రెండు వాహనాల్లో వెళ్తున్నారు. బాబూరావు భార్య గురవమ్మ తో పాటు మరో ఆరుగురు స్కార్పియో వాహనంలో వెళ్తున్నారు. బాబూరావు మరికొందరు కలిసి మరో వాహనంలో వెళ్తున్నారు. ముందు వెళ్తున్న స్కార్పియోకు 63వ నంబర్ జాతీయ రహదారిపై కోడేనార్–కిలేపాల్ గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అడ్డువచ్చింది. దానిని తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గురవమ్మతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారి బంధువుల్లో ఇద్దరు మృతిచెందారు. తీవ్రగాయాలపాలైన మరో నలుగురిని బీజాపూర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చెట్టు పైనుంచి పడి కల్లుగీత కార్మికుడు మృతి

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంకు కల్లు గీత కార్మికుడు ఆరేపల్లి రామారావు (62) తాటి చెట్టు పైనుంచి మృతి చెందాడు. కల్లు గీస్తూ జీవనం సాగించే రామారావు రోజు మాదిరిగానే మంగళవారం కూడా గ్రామ సమీప పొలంలోని తాటి చెట్ల కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కిన ఆయన కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో అక్కడక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కాగా, రామారావు మృతి సమాచారాన్ని గీతకార్మికులు మధిర ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

'అగ్ని' పరీక్షే..


పోస్టాఫీస్ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

- ఒకే సారి రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగితే తప్పని ఇబ్బందులు
- ఇన్‌చార్జ్ పాలనలో కొత్తగూడెం, అశ్వారావుపేట ఫైర్ స్టేషన్లు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం ఎంజీరోడ్డులోని ఒక షాపింగ్ కాంప్లెక్స్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరుగగా ఆస్తి నష్టం సంభవించింది. దమ్మపేటలోని రంగవారిగూడెం గ్రామంలో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఇలా జిల్లాలో ఎదో ఒక చోట రెండు మూడు రోజులుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. అగ్ని ప్రమాదాలు రెండు మూడు చోట్ల జరిగితే అధికారులకు మాత్రం అగ్నిపరీక్షగా మారుతున్నాయి పరిస్థితులు. ఎండా కాలం కావడం.. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో అగ్ని ప్రమాదాల ముప్పు పొంచి ఉంది. అయితే, సరైన సమయంలో స్పందించకపోతే అటు ఆస్తినష్టం, ఇటు ప్రాణనష్టం తప్పదు. అగ్ని ప్రమాదాల నుంచి ప్రజలను, ప్రజల ఆస్తిని రక్షించడంలో అగ్నిమాపక శాఖ సేవలు కీలకంగా ఉంటాయి. అలాంటి అగ్నిమాపక శాఖ.. సిబ్బంది, వాహనాల కొరతతో సతమతమవుతోంది. ప్రతి ఏడాది ఎండాకాలం వచ్చిందంటే అగ్నిమాపకశాఖ కార్యాలయాలకు వందల సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచి ఫోన్‌కాల్స్ వస్తుంటాయి. ఒకేసారి రెండు వేర్వేరు ప్రాంతాల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అగ్ని ప్రమాదాల బారిన పడిన ప్రజలు, ఆస్తుల పరిరక్షణ కోసం క్షణాల్లో అక్కడికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని, ప్రమాదంలో ఉన్నవారి ప్రాణాలు రక్షిస్తారు. ఆస్తి నష్టం జరగకుండా అడ్డుకుంటారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ప్రస్తుతం వేసవికాలం.. ఇళ్లు, షాపింగ్ మాళ్లు, అడవి ప్రాంతాలతో పాటు ఇతర చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సమయంలో అగ్నిమాపకశాఖ సేవలు మరింతగా అవసరం ఉంటాయి. కానీ, ఈ శాఖలో సిబ్బంది, వాహనాలు సరిపడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక ఒకే సమయంలో రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ అధికారుల ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.. ఎటు వెళ్లాలో తెలియక, ప్రజల నుంచి వచ్చే ఒత్తిడి తట్టుకోలేక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరతను తీర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలనలోనే..


కొత్తగూడెం ఫైర్‌స్టేషన్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రస్తుతం ఆయా మండలాల పరిధిలో నాలుగు ఫైర్ స్టేషన్‌లు ఉన్నాయి. వాటిలో నాలుగు ఫైర్ ఇంజన్‌లు పనిచేస్తున్నాయి. కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అశ్వారావుపేట పరిధిలో నాలుగు ఫైర్ స్టేషన్‌లు ఉన్నాయి. అందులో మణుగూరు బోట్ పోస్టు ఫైర్ స్టేషన్ ఉంది. కొత్తగూడెం ఫైర్ స్టేషన్‌కు ఇన్‌చార్జ్‌గా భద్రాచలం ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు వ్యవహరిస్తుండగా, అశ్వారావుపేట ఫైర్ స్టేషన్‌కు సత్తుపల్లి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. ఇల్లెందు ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌గా రామారావు ఉన్నారు. కొత్తగూడెం, అశ్వారావుపేట ఫైర్ ఆఫీసర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా అగ్నిమాపక శాఖలో కొత్తగూడెం ఫైర్ స్టేషన్‌లో 15 మందికి గాను 11 మంది ఉండగా 4 ఖాళీలు, భద్రాచలంలో 11 మందికి గాను ఐదుగురు ఉండగా 6 ఖాళీలు ఉన్నాయి. ఇల్లెందులో 16 మందికి గాను 10 మంది ఉండగా 6 ఖాళీలు, అశ్వారావుపేటలో 16 మందికి గాను ఆరుగురు ఉండగా 10 మంది సిబ్బంది అవసరం ఉంది. మణుగూరు బోట్ పోస్టుగా ఉంది. ఇక్కడ 11 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

త్వరలోనే సిబ్బంది నియామకం..



త్వరలోనే అగ్నిమాపక సిబ్బందిని కేటాయిస్తారు. ప్రజలు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే 101కు సమాచారం అందించాలి. అగ్ని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. ప్రమాదాలు సంభవిస్తే కొత్తగూడెం, భద్రాచలంఫైర్ స్టేషన్ కార్యాలయం 87126 99297, ఇల్లెందు 87126 99295కు సమాచారం అందించాలి. ప్రజలు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–శ్రీనివాస్, జిల్లా ఫైర్ స్టేషన్ ఆఫీసర్

దుమ్ముగూడెం కళాశాల హవా


సాయితేజ


కృష్ణసాయి


సాయి అలేఖ్య


గంగా భవాని

దుమ్ముగూడెం: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల సత్తా చాటింది. ప్రథమ సంవత్సరంలో 88, ద్వితీయ సంవత్సరంలో 92 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కొండా సాయితేజ 990 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడు. మండలోజు యువశ్రీకృష్ణ సాయి 983, పిలక సాయి అలేఖ్య 982, మొదటి సంవత్సరంలో ముసలి గంగా భవాని 470 మార్కులకు 449 సాధించారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎల్. వెంకటేశ్వర్లు అభినందించారు. ఒకేషనల్ గ్రూప్‌లో ప్రథమ సంవత్సరం 47కు 47 మంది, ద్వితీయ సంవత్సరంలో 19కి 19 మంది ఉత్తీర్ణులయ్యారు.

సొంత కంపెనీ పెట్టాలనుంది..

మండలంలోని చిన్నఆర్లగూడేనికి చెందిన కొండా సాయితేజ 990 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాడు. ప్రస్తుతం ఎంసెట్ కోచింగ్ కోసం హైదరాబాద్‌లో ఉన్న సాయి 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూశానని, చదువులో రాణించి సొంతంగా ఏదైనా కంపెనీ స్థాపించాలని ఉందని చెప్పాడు. కాగా, సాయితేజకు రాష్ట్రస్థాయి ర్యాంక్ రావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

'లిటిల్‌ఫ్లవర్స్' విద్యార్థుల సత్తా..


విద్యార్థినికి మెమెంటో అందిస్తున్న ప్రసాద్‌బాబు, రమేశ్‌బాబు


విద్యార్థినులను అభినందిస్తున్న శ్రీవిద్య కళాశాల యాజమాన్యం

భద్రాచలంఅర్బన్: ఇంటర్మీడియట్ ఫలితాలు మంగళవారం విడుదల కాగా పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల విద్యార్థులు సత్తాచాటారని డైరెక్టర్లు మాగంటి రమేశ్‌బాబు, మాగంటి ప్రసాద్ బాబు తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో గుండె లోహితరెడ్డి 990 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే, సాయి ప్రవీణ 989, కీర్తి 987, శ్రీరామ్ గోపాలచార్యులు 987, హేమశ్రీ 986, సోమశ్రీ 986, చింత సంజన 986 మార్కులు సాధించారని చెప్పారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో బర్ల శ్రావణిపావని 988, మేఘన 986 మార్కులు సాధించారన్నారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో సుహాస్ హబ్బా 464, బి.పూజిత 464, నిఖిల్ 461, యశ్వంత్ బాలాజీ రోషిత 460.. బైపీసీ విభాగంలో మహమ్మద్ సమీరా 433, నితిన్ కుమార్ 432 మార్కులు సాధించగా వారిని డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

'శ్రీ విద్య' ప్రతిభ

పినపాక: ఇంటర్ ఫలితాలలో శ్రీ విద్య జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపీసీ ప్రథమ సంవత్సర విద్యార్థిని సంకీర్తన 470 మార్కులకు 466 మార్కులు సాధించింది. సత్య గణేష్ 465 మార్కులతో రెండో స్థానంలో నిలిచాడు. బైపీసీలో వీరజారెడ్డి 440కి 436 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

గురుకుల విద్యార్థుల విజయం


డి.సౌమ్య


హేమశ్రీ

భద్రాచలం: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలు మంగళవారం విడుదల కాగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల విద్యార్థినులు సత్తా చాటారు. ఖమ్మం రీజియన్‌లో భద్రాచలం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చెందిన డి.సౌమ్య 984 (బైపీసీ) మార్కులతో, ఇదే కళాశాలకు చెందిన బి.హేమశ్రీ 983 (ఎంపీసీ) మార్కులతో, అంకంపాలెం టీటీడబ్ల్యూఆర్‌జేసీకి చెందిన బి.పావని 982(ఎంపీసీ), వైరా టీటీడబ్ల్యూఆర్‌జేసీకి చెందిన బి.భూమిక 982 (బైపీసీ) మార్కులతో మొదటి స్థానాల్లో నిలిచారు. కాగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 1,283 మంది పరీక్షలు రాయగా 998 మంది ఉత్తీర్ణులయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో మొత్తం 1,224 మంది పరీక్షలు రాయగా 1,069 మంది ఉత్తీర్ణులయ్యారు. 87 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కాగా, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖమ్మం రీజియన్‌లో టాపర్స్‌గా ఖమ్మం ఎస్‌ఓఈకి చెందిన విక్రం 466 (ఎంపీసీ), శ్రీరామ్ 464 (ఎంపీసీ), టి.సుభాష్ 464 (ఎంపీసీ) మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, బోధించిన అధ్యాపకులను ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు అభినందించారు.

అంగన్‌వాడీ వర్కర్‌పై దాడి చేసినవారిపై కేసు

పాల్వంచ: అంగన్‌వాడీ వర్కర్‌పై దాడి చేసిన దంపతులపై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ బోడ పద్మ అదే గ్రామంలోని కిరాణా షాపులో అప్పు చేసింది. డబ్బుల విషయంపై గొడవ జరిగింది. అనంతరం తనపై దాడి చేశారని పద్మ ఫిర్యాదు చేయడంతో కిరాణా దుకాణ నిర్వాహకులు బానోతు దేవేందర్, సునీత దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రథమస్థానంలో గుండాల గురుకులం


గుండాల గిరిజన గురుకుల కళాశాల

గుండాల: గత మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో గుండాల గురుకుల కళాశాల మొదటి ఇంటర్‌లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుండాల గిరిజన గురుకుల కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. మొదటి ఇంటర్‌లో 110 మంది విద్యార్థులకు గానూ 110 మంది ఉత్తీర్ణులయ్యారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో 97 మందికి 91 మందితో 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుండాల గిరిజన గురుకుల కళాశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో ప్రథమస్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారయణ తెలిపారు. ఖమ్మం డివిజన్‌లో రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

హమాలీల సంక్షేమానికి పాటుపడాలి

- ప్రతీ కార్మికుడు ఈ శ్రామ్ కార్డు తీసుకోవాలి.
- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి


పెద్దబజార్‌లో హమాలీల సమస్యలు తెలుసుకుంటున్న భానుమతి

కొత్తగూడెంటౌన్: హమాలీ కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయడంతో పాటు వారి సంక్షేమానికి పాటు పడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. మంగళవారం కొత్తగూడెం సూపర్‌బజార్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతీ కార్మికుడు బీమాతో పాటు ఈ శ్రామ్ కార్డు కలిగి ఉండాలన్నారు. అధిక బరువు ఉన్న బస్తాలను మోయడం శ్రమతో కూడిన పని అన్నారు. హమాలీలు రోజుకు 8 గంటలకు మించి పనిచేయరాదని, వారికి విశ్రాంతి కోసం వసతితో పాటు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయా యాజమాన్యాలకు సూచించారు. అనంతరం పెద్దబజార్‌లో హమాలీలు పనిచేసే ప్రదేశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, జాయింట్ సెక్రటరీ కాసాని రమేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్‌రావు, త్రీటౌన్ సీఐ అబ్బయ్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, మెండు రాజమల్లు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో ధాన్యం సీజ్

- విలువ రూ.17కోట్ల పైమాటే...
- రిజిస్టర్లు సక్రమంగా లేకపోవడంతో చర్యలు

పెనుబల్లి: ధాన్యం సేకరణ, ప్రభుత్వానికి సీఎంఆర్ ఇచ్చే విషయంలో ముప్పుతిప్పలు పెడుతున్న రైస్‌మిల్లర్లపై చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. ఈక్రమంలోనే పెనుబల్లి మండలం అడవిమల్లెలలోని ఉన్న శ్రీసాయి లక్ష్మీ శ్రీనివాసా పారా బాయిల్డ్ రైస్ మిల్లుపై అందిన ఫిర్యాదులతో సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగ్గా లేని రూ.17,84,37,924 విలువైన ధాన్యాన్ని సీజ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునే సమయాన క్వింటాకు ఏడు కిలోల వరకు తరుగు తీస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఆదేశాల మేరకు సివిల్ సప్లయీస్ సత్తుపల్లి డీటీ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం రైస్ మిల్లులో తనిఖీలు చేయగా పలు అక్రమాలు బయటపడ్డాయి. ఈనెల 7, 8వ తేదీల్లో కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకున్న ధాన్యం లెక్కలు నమోదు చేయకపోగా, మిల్లు యజమాన్యం సొంతంగా కొనుగోలు చేసి ధాన్యం వివరాలను కూడా 'బీ' రిజిస్టర్‌లో నమోదు చేయడం లేదని తేలింది. దీనికి తోడు రిజిస్టార్ అందుబాటులో లేకపోవడం, ధాన్యపు బస్తాలు లెక్కించేందుకు వీలు లేకుండా ఉండడంతో రూ.17,84,37,924 విలువైన ధాన్యాన్ని సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసినట్లు డీఎస్‌ఓ రాజేందర్, సివిల్ సప్లయీస్‌డీటీ సత్యనారాయణ తెలిపారు. కాగా, సీజ్ చేసిన ధాన్యంలో గత ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు కేంద్రాల నుంచి తీసుకున్న రూ.9,88,99,200 విలువైన 48,480 క్వింటాళ్లు, ఈసారి సేకరించిన రూ.4,89,38,784 విలువైన 24,889 క్వింటాళ్ల ధాన్యం, మిల్లు యజమాన్యం సొంతంగా కొనుగోలు చేసిన రూ.3.06కోట్ల విలువైన 15 వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఇదే మిల్లుల్లో ధాన్యాన్ని మర ఆడించి సీఎంఆర్‌గా ప్రభుత్వానికి అప్పగించే బాధ్యతలను సమీపంలోని మారుతీ రైస్ మిల్ యజమాని సత్యప్రసాద్‌కు కట్టబెట్టారు. తనిఖీల్లో మధిర సివిల్ సప్లయీస్ డీటీ రామచందర్ రావు, ఖమ్మం టెక్నికల్ మేనేజర్ రామచందర్‌రావు, సివిల్ సప్లయీస్ ఆర్‌ఐ కిరణ్‌కుమార్, పెనుబల్లి ఆర్‌ఐ భాస్కర్ పాల్గొన్నారు.

విషప్రయోగంతో చేపలు మృతి

తిరుమలాయపాలెం: ఖమ్మం మండలంలోని బీరోలు పెద్ద చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతో టన్నుల కొద్ది చేపలు మృతి చెందాడు. బీరోలు పెద్ద చెరువును మత్స్య పారిశ్రామిక సంఘం నుండి బయ్య మల్లయ్య లీజ్‌కు తీసుకుని చేపలు పెంచుతున్నాడు. కాగా, సోమవారం చేపల వేట జరుగుతున్న సమయాన కొందరు సభ్యులు ఆయనతో గొడవ పడి బెదిరించాడు. మంగళవారం తెల్లవారుజామున చూసే సరికి సుమారు 35 టన్నుల చేపలు మృతి చెందడంతో విష ప్రయోగం చేసినట్లు గుర్తించి పోలీసులకు మల్లయ్య ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

అబార్షన్ ట్యాబ్లెట్లే కారణమా?

సుజాతనగర్: మండలంలోని మాలబంజర గ్రామానికి చెందిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందగా.. ఈ ఘటనపై సుజాతనగర్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూక్యా దివ్య (26)కు అదే గ్రామానికి చెందిన జగపతితో వివాహం జరిగింది. దివ్యకు మొదటి, రెండు కాన్పుల్లో మగ పిల్లలే జన్మించారు. మూడు నెలలుగా రుతుస్రావం కాకపోవడంతో ఈ నెల 5న రుతుస్రావం కోసం ట్యాబెట్లు వేసుకున్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం రక్తస్రావానికి గురికాగా వైద్యం నిమిత్తం ఆమెను కుటుంబ సభ్యులు కొత్తగూడెం తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కాగా, కాన్పు ఇష్టం లేక గర్భాన్ని తొలగించుకోవాలనే ఉద్దేశంతో అబార్షన్ ట్యాబెట్లు వేసుకొందనే ప్రచారం జరుగుతోంది. చంద్రుగొండ మండలం మేకలబండకు చెందిన ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు గర్భస్రావం ట్యాబ్లెట్లు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.తిరుపతిరావు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

బూర్గంపాడు: పురుగులమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం ఉప్పుసాక ఎస్టీకాలనీకి చెందిన చిన రామచంద్రు(36) మద్యానికి బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 7వ తేదీన పొలంలో పురుగులమందు తాగి అచేతనంగా పడి ఉన్నాడు. ఆయన్ను గుర్తించిన పక్క పొలాల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని భాదితున్ని మోరంపల్లిబంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. ఖమ్మం శుక్రవారిపేటకు చెందిన పందిరి కొండలు(58) ప్రకాష్‌నగర్ వైపు వెళ్లడానికి వెంకటగిరి బ్రిడ్జి వద్ద మంగళవారం పట్టాలు దాటుతుతండగా రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేసే కొండలుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నం ఫౌండేషన్ బాధ్యులు అమరేశ్వరరావు తదితరులు మృతదేహన్ని మార్చురీకి తరలించారు.

ఆహారం వికటించి మహిళ..

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడుకు చెందిన పాముల కళావతి(45) తాను తిన్న ఆహారం వికటించడంతో మృతి చెందింది. ఈనెల 3న కళావతికి కోడలు శిరీష ఇచ్చిన కోడిగుడ్డు దోసె తిని పడుకుంది. మరుసటి రోజు వాంతులు, విరేచనాలు అవుతుండడంతో ఆర్‌ఎంపీకి చూపించాక ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమేరకు ఆమె కు వెంకన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటకృష్ణ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ...

మధిర: పట్టణంలోని ఆర్సీఎం చర్చి రోడ్డులో ఒంటరిగా నివసిస్తున్న ధనలక్ష్మ్మి(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజుల క్రితమే ఆమె మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈమేరకు ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతి సహకారంతో ప్రభుత్వ ఆప్పత్రికి తరలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు మధిర టౌన్ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...



యాదాద్రిలో బంగారు పుష్పాల బిగింపు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ పశ్చిమ పంచతల రాజ గోపురం ద్వారాలకు బంగారం పూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులను అమర్చే పనులను శిల్పులు వేగంగా చేస్తున్నారు. సోమవారం రాత్రి పనులను ప్రారంభించిన శిల్పులు ఒక వైపు ద్వారాన్ని పూర్తి చేశారు. మరో వైపు పనులు మంగళవారం రాత్రి చేపట్టారు. ద్వారాలకు బంగారుపూతతో తయారు చేసిన పుష్పాలు, రేకులు బిగించడంతో నూతన కళ సంతరించుకుంది.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య వినతి

కాచిగూడ (హైదరాబాద్): బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ప్రతినిధులు నీల వెంకటేష్, గొరిగ మల్లేష్ యాదవ్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో మంగళవారం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహిర్‌కు వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ కులాలకు ఏ రంగంలో కూడా వాటా దక్క లేదని వివరించారు. జాతీయ బీసీ కమిషన్ జోక్యం చేసుకొని బీసీలకు అన్ని రంగాల్లో వాటా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఉగ్ర ముఠాపై పంజా!

హెచ్‌యూటీ సంస్థ సానుభూతిపరుల ఇళ్లలో సోదాలు ● ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు..

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్), రాష్ట్ర నిఘా వర్గాలు సంయుక్తంగా హైదరాబాద్‌లో మంగళవారం చేపట్టిన ఆపరేషన్‌లో ఐదుగురు హిజ్బు ఉత్ తహరీర్ (హెచ్‌యూటీ) సంస్థ ఉగ్రవాద అనుమానితులు చిక్కారు. ఈ మాడ్యుల్‌కు సూత్రధారిగా ఉన్న మహ్మద్ సలీం.. ఓ మెడికల్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ హెడ్‌గా పనిచేస్తుండగా, పట్టుబడినవారిలో ఒక దంత వైద్యుడు, ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం కలకలం రేపుతోంది. ఈ ఐదుగురినీ ఏటీఎస్ అధికారులు పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. ఇదే సమయంలో మధ్యప్రదేశ్‌లోనూ ఏటీఎస్ అధికారులు మరో 11 మంది హెచ్‌యూటీ సంస్థ సభ్యులను అరెస్టు చేశారు. వారందరినీ అక్కడి కోర్టులో హాజరుపర్చగా.. ఈ నెల 19వ తేదీ వరకు వారిని ఏటీఎస్ కస్టడీకి అప్పగించింది.



అరెస్ట్ చేసిన వారిని భోపాల్ కోర్టుకు తరలిస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు. (ఇన్‌సెట్లో) సలీం

■ **ఐసిస్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా..**

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా హెచ్‌యూటీ సంస్థ పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు, ఉగ్రవాదులకు సానుభూతిపరులను తయారుచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్న ఈ సంస్థ.. భారత్ సహా 50కిపైగా దేశాల్లో ఉనికిలో ఉంది. మన దేశంలో దీనిపై నిషేధం లేదు. కొంతకాలం నుంచి హెచ్‌యూటీ సంస్థ ఎక్కడికక్కడ మాడ్యూల్స్‌ను తయారు చేసుకుంటూ విస్తరిస్తోంది. తమకు ఆకర్షితులైన వారికి శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేకంగా ఆర్మ్‌డ్ వింగ్‌ను ఏర్పాటు చేసుకుంది. సోషల్ మీడియాలో గ్రూపులనూ నిర్వహిస్తోంది. కేడర్‌కు ప్రమాదకర ఆయుధాల వినియోగంతోపాటు రసాయన, జీవాయుధాల (కెమికల్, బయోలాజికల్) దాడులు చేసేలా.. వీటికి సంబంధించి ఎవరికి వారు మెటీరియల్ సిద్ధం చేసుకునేలా తర్ఫీదు ఇస్తోంది.

■ **మధ్యప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ మాడ్యూల్..**

భోపాల్‌కు చెందిన యాసీర్ హెచ్‌యూటీలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. తనతో కలసి చదువుకున్న సౌరభ్‌రాజ్ వైద్యను మతం మార్చుకుని, హెచ్‌యూటీలో చేరేలా ప్రోత్సహించాడు. మహ్మద్ సలీంగా పేరుమార్చుకున్న సౌరభ్.. 2019లో హైదరాబాద్‌లోని గోల్కొండ బాబాబజార్ మోతీ మహల్‌కు వలస వచ్చాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ కాలేజీలో ఫార్మాస్యూటికల్ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా ఉద్యోగంలో చేరాడు. మరోవైపు కొన్నేళ్ల కింద ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన దేవీప్రసాద్ పాండ కొన్నేళ్ల క్రితమే మతం మార్చుకుని అబ్దుర్ రెహ్మాన్‌గా మారాడు. గోల్కొండలోని ధన్కోక ప్రాంతంలో నివాసం ఉంటూ.. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. ఇక హైదరాబాద్‌లోని హఫీజ్‌బాబా నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బస్క వేణుకుమార్ కూడా కొన్నేళ్ల క్రితం మతం మార్చుకుని మహ్మద్ అబ్బాస్ అలీగా మారాడు.

సలీం ఈ ఇద్దరితోపాటు గోల్కొండ బడాబజార్‌కు చెందిన దంత వైద్యుడు షేక్ జునైద్, జగద్గిరిగుట్ట మగ్దూంనగర్‌కు చెందిన మహ్మద్ హమీద్, జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌లను ఆకర్షించాడు. తనతో సహా ఆరుగురితో హెచ్‌యూటీ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశాడు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో యాసీర్ నేతృత్వంలో 11 మంది మరో మాడ్యూల్ కార్యకలాపాలు ప్రారంభించింది.

■ **మూడు నెలల పాటు నిఘా పెట్టి..**

యాసీర్, సలీంల మాడ్యూల్స్ ఉగ్రవాద దాడులకు సిద్ధమవుతున్న విషయంపై మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులకు మూడు నెలల క్రితం జాతీ నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. అప్పటి నుంచి తెలంగాణ నిఘా వర్గాల సాయంతో ఏటీఎస్ అధికారులు వీరిపై కన్నేసి ఉంచారు. అన్ని అంశాలను నిర్ధారించుకుని.. మంగళవారం తెల్లవారుజామున అటు భోపాల్‌లో, ఇటు హైదరాబాద్‌లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భోపాల్‌లో 11 మంది పట్టుబడగా.. హైదరాబాద్‌కు చెందిన మాడ్యూల్‌లో మహ్మద్ సల్మాన్ మినహా ఐదుగురిని పట్టుకున్నారు. మహ్మద్ సలీం ఇంటి నుంచి రెండు ఎయిర్‌గన్‌లు, పిల్లెట్స్, కత్తులు, గొడ్డళ్లతో పాటు ఉగ్రవాద సాహిత్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఐదుగురిని పీటీ వారెంట్‌పై భోపాల్‌కు తరలించారు. పరారీలో ఉన్న మహ్మద్ సల్మాన్ కోసం రాష్ట్ర పోలీసులు గాలిస్తున్నారు.

■ **నిషేధం విధించేలా..**

హెచ్‌యూటీ సంస్థపై 2021లో తమిళనాడులో ఓ కేసు నమోదైంది. దాన్ని దర్యాప్తు చేసిన 'నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ)'గతేడాది అభియోగపత్రాలు దాఖలు చేసినట్టు అధికారులు తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సంస్థపై నిషేధం విధించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నట్టు వెల్లడించారు.

అనంతగిరి అడవుల్లో క్యాంప్.. హైదరాబాద్‌లో రెక్కీ..

యాసీర్, సలీంల నేతృత్వంలోని 17 మంది ప్రత్యేకంగా రాకెట్ చాట్ యాప్ ద్వారా సంప్రదింపులు జరిపారు. తుపాకులు, కత్తులు, గొడ్డళ్లను వినియోగించి ఎవరికి వారుగా 'లోన్ వూల్ఫ్ ఎటాక్స్ (ఒంటరిగానే ఎవరిపైనైనా దాడిచేసి కలకలం రేపడం)'చేయాలని.. అవసరమైనప్పుడు బాంబులు తయారు చేసి జనసమ్మర్ద ప్రాంతాల్లో విరుచుకుపడాలన్నది వీరి పథకం. ఇందుకోసం అఫ్గానిస్తాన్‌లో అమెరికా బలగాలతో పోరాడిన ఐసిస్ మాడ్యుల్స్‌ను ఆదర్శంగా తీసుకున్నారు. రెండు మాడ్యూల్స్‌కు చెందిన 17 మంది కొన్నినెలల కింద వికారాబాద్ అనంతగిరి అడవుల్లో క్యాంపు నిర్వహించారు. ఎవరిని టార్గెట్‌గా ఎంచుకోవాలి? ఏ విధంగా దాడులకు దిగాలనేది చర్చించుకున్నారు. తర్వాత హైదరాబాద్ నగరంలో రెక్కీ చేశారు. పలు కీలక ప్రాంతాల్లో డ్రోన్లతోనూ రెక్కీ చేసి.. దాడులకు సన్నాహాలు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపుల్లో ఉంటూ దాడులకు మెటీరియల్‌ను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

ఐసిస్ కన్నా ప్రమాదకరంగా హెచ్‌యూటీ!

ఉగ్రవాద సంస్థ ఐసిస్‌కు అనుబంధంగా హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) సంస్థ పనిచేస్తున్నట్టు ప్రచారమున్నా.. దాని మూలాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. 1952లో ఇజ్రాయెల్‌లోని జేరుసలేంలో స్థాపితమైన ఈ సంస్థ.. ప్రస్తుతం లండన్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తోంది. యూరప్‌తోపాటు ఆసియాలోని ముస్లిం ప్రభావిత దేశాలకు విస్తరించింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియాలో దీని ఉనికి ఎక్కువ. నేరుగా ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడకపోవడంతో చాలా దేశాల్లో దీనిపై నిషేధమేదీ లేదు. అయితే ఐసిస్ ఉగ్రవాద సంస్థ పతనం అనంతరం ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు హెచ్‌యూటీ ప్రయత్నిస్తున్నట్టు అంతర్జాతీయ నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ సంస్థ ఐసిస్ కన్నా ప్రమాదకరంగా మారుతోందని.. రసాయన, జీవాయుధాల వినియోగంపై కేడర్‌కు శిక్షణ ఇస్తోందని హెచ్చరించాయి. భారత్‌లో హెచ్‌యూటీ కార్యకలాపాల విస్తరణపై అంతర్జాతీయ భద్రతా సంస్థల నుంచి కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందిందని సమాచారం. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా నిఘా పెట్టినట్టు అధికారవర్గాలు చెప్తున్నాయి.





కె.పూజ



విజయ్‌రాయ్

ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులతో ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి

ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విజయకేతనం

హన్మకొండ చౌరస్తా: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందించారు. సెకండియర్‌లో కె.పూజ 994 సాధించగా, ఐదుగురు విద్యార్థులు 993 సాధించారని వరదారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బైపీసీ సెకండియర్‌లో విజయ్‌రాయ్ 992, వర్ష 991, మరో నలుగురు 990 మార్కులు సాధించారని తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 10 మంది విద్యార్థులు 467, 45 మంది 466 సాధించారని తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు ఐదుగురు విద్యార్థులు 436 మార్కులు సాధించినట్లు చెప్పారు.



టాపర్స్‌తో ట్రినిటీ కళాశాల విద్యాసంస్థల చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, అధ్యాపకులు

ఇంటర్ ఫలితాల్లో 'ట్రినిటీ' ప్రభంజనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో కరీంనగర్‌లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్వితీయ ప్రతిభ కనబరిచారు. సెకండియర్ ఎంపీసీలో కె.నిఖిత, ఎం.మానస 990 మార్కులు, ఇద్దరు విద్యార్థులు 989, ఇద్దరు 988, ఇద్దరు 987 మార్కులు సాధించారు. బైపీసీలో చంద్రశేఖర్ 989 మార్కులు, ఐదుగురు విద్యార్థులు 988, ఇద్దరు 985, ఎంఈసీలో ఆర్.సాత్విక 986 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో వి.ఆశ్రిత, ఎం.శ్రావ్య 467, ఆరుగురు విద్యార్థులు 466 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.గంగశ్రీ 436 మార్కులు, కె.రాణి 435, రిదా హర్షణ్ 434 మార్కులు సాధించారు. ఎంఈసీలో కె.పూజ 470, సీఈసీలో డి.వర్షిణి 489 మార్కులు సాధించారు.



టాపర్స్‌తో ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

సత్తాచాటిన 'ఆల్ఫోర్స్'

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులను ఆల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. సెకండియర్ ఎంపీసీలో ఎస్.హర్షిత, ఎస్.ఉజ్వల్, ఎస్.హరిణి, జి.వినీత, కె.రాజశేఖర్ 992 మార్కులు సాధించారు. బైపీసీలో ఎస్.నిహారిక 992 మార్కులు సాధించారు. ఎంఈసీలో సి.హెచ్.మనీషా, జి.అమూల్య 988 మార్కులు సాధించారు. ఫస్టియర్ ఎంపీసీలో పది మంది విద్యార్థులు 467 మార్కులు, బైపీసీలో ఏ.శ్రీనిధి 437, ముగ్గురు 436 మార్కులు, ఎంఈసీలో ఎం.వినమ్రత 488 మార్కులు సాధించారు.

జిల్లా వార్తలు

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో ఉన్న గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి ఉన్న మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్ అధ్యాపకుల పోస్టులు ఒక్కొక్కటితో పాటు లైబ్రేరియన్ పోస్ట్ ఒకటి ఖాళీగా ఉందని పేర్కొన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీతో పాటు నెట్ లేదా సెట్ అర్హత లేదంటే పీహెచ్‌డీ కలిగిన వారు తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 16 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఏపీఓ, డీడీ

భద్రాచలంటౌన్: ఐటీడీఏ ఆధ్వర్యాన అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఇప్పిస్తున్న గ్రూప్–4 ఉచిత శిక్షణను గిరిజన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. భద్రాచలం వైటీసీ భవనంలోని గూప్–4 శిబిరాన్ని మంగళవారం డీడీ రమాదేవితో కలిసి సందర్శించిన ఆయన అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి మాట్లాడారు. అభ్యర్థులు 210 మందికి నెల పాటు ఉచిత వసతితోపాటు భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణను యువత సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, ఫ్యాకల్టీలు వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్బన్ పార్క్‌ను సందర్శించిన పీసీసీఎఫ్

ఇల్లెందురూరల్: ఇల్లెందు మండలంలోని అటవీశాఖ ఆధ్వర్యాన నిర్మించిన అర్బన్ పార్క్‌ను పీసీసీఎఫ్ డోబ్రియల్ మంగళవారం రాత్రి సందర్శించారు. పార్క్ నిర్మాణం పూర్తికాగా, ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. పార్క్‌ను ప్రారంభించే గాలోగా సందర్శకులు వస్తే అనుమతించాలని, అందుకోసం ప్రత్యేకంగా టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎఫ్ భీమానాయక్, డీఎఫ్ఓ రంజిత్‌నాయక్, ఎఫ్‌డీఓ అప్పయ్య, ఎఫ్ఆర్ఓ నాగేశ్వరరావు, డీఆర్‌ఓ స్వామలన్‌రాజ్ పాల్గొన్నారు.

'ప్రగతి'బాటలో ఆర్టీసీ

- ఉమ్మడి జిల్లాలోని డిపోలకు పెరుగుతున్న ఆదాయం
- సంస్థకు కలిసొస్తున్న శుభకార్యాలు
- వారం రోజులుగా లాభాల బాట
- ఖమ్మం రీజియన్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు



కొత్తగూడెం ఆర్టీసీ డిపో

చుంచుపల్లి: ఆర్టీసీలో చేపడుతున్న పలు సంస్కరణలతో ఏడాది కాలంగా సంస్థలో మూస ధోరణికి బ్రేక్ పడింది. ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించడానికి ఇది కొంతమేర దోహదపడుతోంది. అంతేకాక సంస్థ సరికొత్త ఆలోచనలతో ప్రయాణికులను ఆకట్టుకునే సేవలతో మరింత చేరువవుతోంది. ఆర్టీసీలో ఇప్పటికే కార్గో సేవల ద్వారా అన్ని డిపోలు అదనపు ఆదాయం రాబడుతూ సానుకూల ఫలితాలు సాధిస్తున్నాయి. ఇక మే నెల ఆరంభం నుంచి ప్రయాణికుల ఆదరణ పెరగడంతో ఆదాయపరంగానూ కలిసి వస్తోంది. ఏప్రిల్‌లో మూఢాలు ఉండడంతో శుభకార్యాలు జరగలేదు. దీంతో ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గి.. దాదాపు అన్ని డిపోలు రోజువారీ ఆదాయం గణనీయంగా కోల్పోయాయి. ఒక్కో డిపోలో రోజువారీ నిర్దేశిత లక్ష్యంలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం తగ్గగా.. డిపోల మెయింటెనెన్స్ ఖర్చులకు కూడా కటకటగా మారింది. ఇక ఈ నెల ఆరంభం నుంచి ఆర్టీసీకి ఆదాయ పరంగా మంచి ఘడియలు వచ్చాయి. గడిచిన వారం రోజులుగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు కలిసిరావడంతో డిపోల పరిధిలో ఆదాయం ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుండడం రాబడి పెరగడానికి దోహదపడుతోంది. రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు డిపోలు సోమవారం వరకు భారీగా లాభాలు ఆర్జించాయి. అధిక ఆదాయం రాబట్టి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. ఇప్పటికే తీవ్ర నష్టాల్లో సతమతమవుతున్న ఆర్టీసీ డిపోలకు ఈ ఎనిమిది రోజుల్లో వచ్చిన లాభాలు కొంత ఊరట కలిగిస్తున్నాయి.

8 రోజుల్లో రూ.64.96 లక్షలు..

ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లోని ఆరు డిపోల పరిధిలో మొత్తం 545 బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ప్రతి రోజూ రెండు లక్షల కిలోమీటర్ల మేర సర్వీసులు తిరుగుతున్నాయి. రీజియన్ నుంచి హైదరాబాద్‌కు ఎక్కువ సర్వీసులు నడుస్తుంటాయి. నిత్యం 1.30 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రీజియన్‌లోని ఆరు డిపోల్లో ఖమ్మం, భద్రాచలం ఆదాయం రాబట్టడంలో అగ్రభాగంలో నిలుస్తుంటాయి. ఈ నెల 3 నుంచి వరుసగా శుభ ముహూర్తాలు ఉండటంతో ఆర్టీసీకి ఆదాయం బాగా కలిసొచ్చింది. మే నెలతో పాటు జూన్ 14 వరకు శుభ ముహూర్తాలు ఉండటం సంస్థకు కలిసిరానుంది. ఈ నెలలో ఇప్పటివరకు ఆదాయ పరంగా మంచి లాభాలు పొందిన రాష్ట్రంలోని 45 డిపోల్లో భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోలకు చోటు దక్కడం విశేషం. రీజియన్‌లోని డిపోలకు సోమవారం నాటికి ఖర్చులన్నీ పోను రూ.64.96 లక్షల మేర ఆదాయం సమకూరింది. ఇందులో కొత్తగూడెం డిపోకు గత ఎనిమిది రోజుల్లో వచ్చిన రాబడి మొత్తం రూ.1.09 కోట్లు రాగా, డిపో ఖర్చులు పోగా రూ.7.58 లక్షల మేర లాభం వచ్చింది. భద్రాచలం డిపోకు రూ.1.72 కోట్లు ఆదాయం రాగా, డిపో ఖర్చులు పోను రూ.16.11 లక్షల లాభం సమకూరింది. మణుగూరు డిపోకు ఈ నెల 8 వరకు రూ.1.30 కోట్ల ఆదాయం సమకూరగా, డిపో ఖర్చులు పోగా రూ. 6.74 లక్షలు, సత్తుపల్లి డిపోకు రూ.1.52 కోట్ల ఆదాయం సమకూరగా, ఖర్చులు పోను రూ.9.18 లక్షలు, ఖమ్మం డిపోకు రూ.2.52 కోట్ల ఆదాయం రాగా, డిపో ఖర్చులు పోగా రూ.25.35 లక్షల మేర లాభాలు వచ్చాయి. మధిర డిపో మాత్రమే ఆదాయ పరంగా కాస్త వెనుకబడింది. ఇప్పటి వరకు ఈ డిపోకు రూ.96 లక్షలు మేర ఆదాయం మాత్రమే సమకూరింది. ఇక్కడ వచ్చిన ఆదాయం, ఖర్చులు సమానంగా ఉన్నాయి.

లాభాలు రావడం శుభ పరిణామం



గత నెల ఆర్టీసీకి కొంత మేర నష్టాలే మిగిలాయి. ఎండల తీవ్రతతో ప్రయాణికుల సంఖ్య భాగా తగ్గడం, శుభకార్యాలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో రీజియన్‌లోని ఒక్కో డిపో రోజువారీగా భారీగా నష్టపోవాల్సి వచ్చింది. ఇక మే నెల ఆరంభం నుంచి శుభ ముహూర్తాలు ఉండడంతో ఆర్టీసీ ఆదాయం క్రమంగా పుంజుకుంటోంది. గత వారం రోజుల్లో డిపోలు లాభాల బాట పట్టడం శుభ పరిణామం.

– ఎస్తేరు ప్రభులత, ఆర్ఎం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వెంకటవీరయ్య

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి: రాష్ట్ర పురపాలక శాఖామంత్రి కల్వకుంట్ల తారక రామారావును సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి రూ.60 కోట్లు కేటాయించడంపై కేటీఆర్‌కు కృతజ్ఞతలు చెప్పిన ఎమ్మెల్యే, అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరుకావాలని కోరారు. అంతేకాక మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

నేడు ఈటల రాజేందర్ పర్యటన

తిరుమలాయపాలెం: మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బుధవారం తిరుమలాయపాలెం మండలంలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు మేక సంతోష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాతర్లపాడు, బీరోలు, పాలేరుల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకుంటారని వెల్లడించారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించండి

మావోయిస్టు కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శి రాజు

చర్ల: బూటకపు ఎన్‌కౌంటర్లను ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు ఖండించాలని మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం ఆయన పేరిట ఒక లేఖ విడుదలైంది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పుట్టపాడు ప్రాంతంలో కూంబింగ్ చేపట్టిన పోలీసులు పుట్టపాడు గ్రామస్తులంతా తునికాకు సేకరణకు వెళ్లినప్పుడు గ్రామాన్ని చుట్టిముట్టి ఒంటరిగా ఉన్న సోడి మాడను పట్టుకొని కాల్చిచంపారని ఆరోపించారు. పోలీసులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు చెబుతున్న సోడి మాడ మావోయిస్టు కాదని, సాధారణ పౌరుడేనని తెలిపారు. పీఎల్‌జీఏ కార్యకర్త రాజేష్‌ను కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లోనే హతమార్చారని వెల్లడించారు. ఆదివాసీ గ్రామాలపై దాడులు, ఆది వాసీలను విచక్షణారహితంగా కొట్టడం, కాల్పులు జరపడం ఇటీవల పోలీసులకు పరిపాటిగా మారిందని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ, పీఎల్‌జీఏ, విప్లవ ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలను నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలీసులతో కూంబింగ్ చేయిస్తున్నారని పేర్కొన్నారు.

సుక్మా ఎన్‌కౌంటర్ బూటకం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా బెజ్జి పోలీస్‌స్టేషన్ పరిధి దంతేశ్‌పురం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ ఓ లేఖలో పేర్కొన్నారు. మృతిచెందిన ఇద్దరూ సంస్థ సభ్యులేనని, నెల క్రితం వారు పార్టీని వీడి సొంత గ్రామానికి తిరిగి వచ్చి సాధారణ జీవితం గడుపుతున్నారని తెలిపారు. కానీ ఎన్‌కౌంటర్ జరిగినట్టు పోలీసులు చెబుతున్న దంతేశ్‌పురం అటవీ ప్రాంతంలో మావోయిస్టుల బృందం సంచరించలేదని ఆమె స్పష్టం చేశారు. గొల్లపల్లి ఎల్‌ఓఎస్ కమాండర్ మడ్కం ఎర్ర, ఎల్‌ఓఎస్ సభ్యురాలు పొడియం భీమ్‌ను సుక్మా పోలీసులు అదుపులోకి తీసుకుని హతమార్చారని ఆరోపించారు.

మాదిరి పాఠ్యపుస్తకం ఎంతో ప్రయోజనకరం

సత్తుపల్లిటౌన్: తల్లిదండ్రులకు ఆర్థిక భారం, విద్యార్థులకు సంచిబరువు తగ్గించే విధంగా తయారు చేసిన మాదిరి పాఠ్యపుస్తకం ఎంతో ప్రయోజనకరంగా ఉందని, వచ్చే విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని తెలంగాణ విద్యాశాఖామంత్రి సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం సత్తుపల్లికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బి.మధుసూదన్‌రాజు, పీఆర్టీయూ రాష్ట్ర ప్రతినిధులు చిత్తలూరి ప్రసాద్, బీరెల్లి కమలాకర్‌రావు, పింగళి శ్రీపాల్‌రెడ్డి మంత్రి సబిత ఇంద్రారెడ్డిని కలిసి వేమన భాషామృతం మాదిరి పాఠ్యపుస్తకాన్ని అందించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనకు ఈ పుస్తకాన్ని పంపించి వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు గుర్రం చెన్నకేశవరెడ్డి, జయపాల్‌రెడ్డి ఉన్నారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి మాదిరి పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

భయం..భయంగా గడిపాం

ఇంఫాల్ నుంచి ఇంటికి చేరుకున్న హర్షవర్ధన్

ఏన్కూరు : కళ్లెదుటే కాల్పులు.. అప్పుడప్పుడూ పేలుతున్న బాంబులు.. కాలుతున్న ఇళ్లు.. ఇలా నాలుగు రోజుల పాటు ఇంఫాల్ భయం భయంగా గడిపామని మండలంలోని రాంనగర్ తండాకు చెందిన ధర్మసోత్ హర్షవర్ధన్ చెప్పాడు. అనేక ఇబ్బందుల నడుమ ఇంఫాల్ నుంచి ఇంటికి చేరుకున్న హర్షవర్ధన్.. మంగళవారం 'సాక్షి'తో మాట్లాడాడు. అక్కడి వాతావరణం చూస్తే ఇంటికి చేరుకుంటామా లేదా అని భయం వేసిందని చెప్పాడు. అక్కడి దృశ్యాలను మరిచిపోలేకపోతున్నానని, ఇంటికి వచ్చాక కొంత భయం తగ్గిందని వివరించాడు. ఈ నెల 22 నుంచి జూన్ 2 వరకు సెకండ్ సెమ్ పరీక్షలు జరగాల్సిన తరుణంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ యుద్ధంలా మారిందని, పరీక్షలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తారో లేక వచ్చే సంవత్సరమే పెడతారో తెలియదని అన్నాడు. కాగా, మంగళవారం ఉదయం హర్షవర్ధన్ ఇంటికి రాగానే తల్లిదండ్రులు రమేష్, కవిత అతడిని చూసి భావోద్వేగానికి లోనయ్యారు.



తల్లిదండ్రులతో హర్షవర్ధన్